సంపుటి :02 సంచిక :278 పేజీలు :06 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 13, జనవరి 2026

# ఓటర్ల తుది జాబితా విడుదల

- మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తి
- కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో మొత్తం ఓటర్లు 52,43,023 మంది
- వీరిలో మహిళలు 26,80,014.. పురుషులు 2,62,369 మంది
- బల్దియా ఎన్నికల్లో మహిళా శక్తే నిర్ణయాత్మక శక్తి





# మేడారంలో వన సింగారం!

- టెంపుల్ సిటీగా మార్చిన రూ. 251 కోట్లు
- ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేలా జంక్షన్ల సుందరీకరణ

## మహా జాతరకు ముస్తాబైన మేడారం

అడవి తల్లి ఒడిలో కొలువైన మేడారం సమ్మక్కసారలమ్మల చెంతకు కోట్లాది మంది భక్తులు కదిలివచ్చే వేళ ఆసన్నమైంది. ఈ నెల 28 నుంచి జరిగే మహా జాతర కోసం మేడారం సరికొత్త హంగులను అద్దుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం రూ. 251 కోట్లతో మేడారాన్ని ఒక అద్భుతమైన టెంపుల్ సిటీగా తీర్చిదిద్దింది. రోడ్ల విస్తరణ, ఆదివాసీల ఆచారాలను ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన జంక్షన్లు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వనదేవతల గద్దెలు ఇప్పుడు సరికొత్త శోభతో ఆధ్యాత్మిక కళను సంతరించుకున్నాయి. – అక్షర దర్బార్, మేడారం

05


# మేడారానికి ఈసారి 3 కోట్ల మంది



- సమ్మక్క సారలమ్మ జాతరను కుంభమేళాకు మించి ఘనంగా నిర్వహించాలి
- రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ
- రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క


03

# రంగంలోకి సిట్



- మహిళా ఐఏఎస్ పై వదంతులపై ప్రభుత్వం సీరియస్
- ఫేక్ వార్తల ప్రసారం.. నకిలీ వార్తల వ్యాప్తిపై కన్నెర్ర
- హైదరాబాద్ సీపీ సజ్జనార్ సారథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఇప్పటికే పలు శాటిలైట్, యూట్యూబ్ చానెళ్లపై కేసులు

02



# ఏడాది తర్వాతే జిల్లాల పునః విభజన

- వచ్చే ఏడాది మార్చి 1 వరకు జనగణన అడ్డంకి
- ఆ తర్వాతే జిల్లాల విభజన అంశం
- వరంగల్, హనుమకొండ జిల్లాలు ఒకటిగా మారే అవకాశం
- పీవీ జిల్లా సాధనపై ఇప్పటికీ సడలని ఆశలు

02

## జ్యుడిషియల్ కమిటీ నివేదికు 6 నెలల సమయం

తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం సరికొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఉన్న జిల్లాల విభజనలో దొర్లిన అశాస్త్రీయతను సరిదిద్ది, ప్రజల చెంతకే పాలనను అందించేలా హేతుబద్ధీకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అయితే, ఈ ప్రక్రియ అధికారికంగా పూర్తి కావడానికి సాంకేతిక కారణాల దృష్ట్యా మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన నిబంధనల ప్రకారం, వచ్చే ఏడాది మార్చి 1 వరకు జిల్లాల సరిహద్దులను మార్చే వీలు లేదు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. అయితే, ఈ సమయాన్ని ప్రభుత్వం ఒక సువర్ణావకాశంగా మలుచుకుని, ఈలోపే వ్యవస్థాపరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని భావిస్తోంది. జ్యుడీషియల్ కమిషన్ నివేదికను సిద్ధం చేయడం, కేబినెట్‌లో చర్చించి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం వంటి అన్ని లాంఛనాలను ఈ ఏడాది కాలంలోనే పూర్తి చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. – అక్షరదర్బార్, వరంగల్

# రంగంలోకి సిట్




- **మహిళా ఐఏఎస్ పై వదంతులపై ప్రభుత్వం సీరియస్**
- **ఫేక్ వార్తల ప్రసారం.. నకిలీ వార్తల వ్యాప్తిపై కన్నెర్ర**
- **హైదరాబాద్ సీపీ సజ్జనార్ సారథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం**
- **ఇప్పటికే పలు శాటిలైట్, యూట్యూబ్ చానెళ్లపై కేసులు**

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : తెలంగాణలో మహిళా ఐఏఎస్ అధికారుల ప్రతిష్ఠను మసకబార్చేలా సాగుతున్న కుట్రపూరిత చర్యలపై రాష్ట్రప్రభుత్వం సీరియస్ గా స్పందించింది. ఒక మహిళా ఐఏఎస్ అధికారిణి వ్యక్తిగత జీవితం, ఆమె వృత్తిపరమైన బాధ్యతలపై కొందరు కావాలనే విష ప్రచారం చేస్తున్నారని గుర్తించిన యంత్రాంగం, దీని వెనుక ఉన్న వారిని పట్టుకునేందుకు సిద్ధమైంది. ఊహాగానాలు, వదంతులను ఆధారంగా చేసుకుని కొన్ని మీడియా సంస్థలు కథనాలు ప్రసారం చేశాయని, ఎలాంటి ఆధారాలు లేకుండా అల్లిన కథనాలు ఆమె గౌరవానికి భంగం కలిగించడమే కాకుండా, మొత్తం ఐఏఎస్ వ్యవస్థ గౌరవానికే భంగం వాటిల్లే ప్రమాదం ఏర్పడిందని ప్రభుత్వం భావించింది. ఈ అంశంపై నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. ఈ సిట్‌కు హైదరాబాద్ సీపీ సజ్జనార్ సారథ్యం వహించనున్నారు.

**- వదంతులు ఇవి..**

సదరు మహిళా ఐఏఎస్ అధికారిణిపై వచ్చిన ఆరోపణలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని ఐఏఎస్ అధికారుల సంఘం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఒక రాజకీయ నాయకుడితో ఆమెకు సంబంధాలు ఉన్నాయని, ఆ సాకుతోనే ఆమెకు అనుకూలమైన బదిలీలు దక్కాయని కొన్ని మీడియా సంస్థలు ప్రసారం చేశాయి. గత రెండేళ్లలో ఆమె పనిచేసిన బదిలీల వివరాలను విశ్లేషిస్తూ, ఆమె పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆమె ఎవరో తెలిసేలా ప్రసారం చేయడం గమనార్హం. ఫోన్ సంభాషణలు, వాట్సాప్ చాట్లు ఉన్నాయంటూ ఎటువంటి ఆధారాలు చూపకుండా చేసిన ఈ ప్రచారం పెద్ద దుమారం రేపింది.

**- వ్యక్తిత్వ హననంపై..**

ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని కేవలం ఒక అధికారిణి వ్యక్తిగత అంశంగా కాకుండా, వ్యవస్థపై జరుగుతున్న దాడిగా పరిగణించింది. డీజీపీ శివధర్ రెడ్డి నేతృత్వంలో సీపీ సజ్జనార్ పర్యవేక్షణలో ఎనిమిది మంది సమర్థులైన అధికారులతో సిట్ రంగంలోకి దిగింది. ఇందులో నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ వంటి అనుభవజ్ఞులైన పోలీసులు ఉన్నారు. మహిళా అధికారుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేశ్ రంజన్ ఫిర్యాదుతో రెండు తెలుగు న్యూస్ ఛానళ్లు, ఏడు యూట్యూబ్ ఛానళ్లపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

**- సీరియస్ గా దర్యాప్తు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోలను అసభ్యకరంగా వక్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఉదంతాన్ని కూడా సిట్ విచారించనుంది. తెలంగాణ పబ్లిక్ టీవీ వాట్సాప్ గ్రూపులో ఈ ఫోటోలను షేర్ చేసిన కావలి వెంకటేశ్ అనే వ్యక్తిపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. రాజకీయ కక్షలతో అధికారుల పరువు తీయడం, అబద్ధపు వార్తలతో పబ్లిసిటీ పొందడం వంటి ధోరణులకు అడ్డుకట్ట వేయడమే సిట్ ప్రధాన లక్ష్యం. ఐఏఎస్, ఐపీఎస్ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఏడాది కాలం పాటు సాగే దర్యాప్తు తర్వాత ఈ ప్రచారాల వెనుక ఉన్న అసలు కుట్రదారులు ఎవరనేది తేటతెల్లం కానుంది.

# ఏడాది తర్వాతే జిల్లాల పునర్విభజన

- **జ్యుడిషియల్ కమిటీ నివేదికు 6 నెలల సమయం**
- **వచ్చే ఏడాది మార్చి 1 వరకు జనగణన అడ్డంకి**
- **ఆ తర్వాతే జిల్లాల విభజన అంశం**
- **వరంగల్, హనుమకొండ జిల్లాలు ఒకటిగా మారే అవకాశం**
- **పీవీ జిల్లా సాధనపై ఇప్పటికీ సడలని ఆశలు**




అక్షరదర్బార్, వరంగల్ : తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం సరికొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఉన్న జిల్లాల విభజనలో దొర్లిన అశాస్త్రీయతను సరిదిద్ది, ప్రజల చెంతకే పాలనను అందించేలా హేతుబద్ధీకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అయితే, ఈ ప్రక్రియ అధికారికంగా పూర్తి కావడానికి సాంకేతిక కారణాల దృష్ట్యా మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన నిబంధనల ప్రకారం, వచ్చే ఏడాది మార్చి 1 వరకు జిల్లాల సరిహద్దులను మార్చే వీలు లేదు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. అయితే, ఈ సమయాన్ని ప్రభుత్వం ఒక సువర్ణావకాశంగా మలుచుకుని, ఈలోపే వ్యవస్థాపరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని భావిస్తోంది. జ్యుడీషియల్ కమిషన్ నివేదికను సిద్ధం చేయడం, కేబినెట్‌లో చర్చించి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం వంటి అన్ని లాంఛనాలను ఈ ఏడాది కాలంలోనే పూర్తి చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

**- పెరుగుతున్న ఆశలు**

ప్రభుత్వం ఇప్పటికే జిల్లాల పునర్వ్యవస్థీకరణకు రిటైర్డ్ సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి జ్యుడీషియల్ కమిషన్‌ను త్వరలోనే నియమించనుందని ప్రకటించింది. కమిషన్ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి వచ్చే వినతులను పరిగణనలోకి తీసుకుని జిల్లాల పునర్నిర్మాణంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ చారిత్రాత్మక మార్పుల వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ, వరంగల్ జిల్లాలు ఒకటిగా మారే అవకాశం ఉందని, ఈ రెండు జిల్లాల స్థానంలో వరంగల్ పేరుతో ఒక జిల్లా ఉనికిలోకి రావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే చారిత్రక వరంగల్ మహానగరం ఒకే జిల్లాలో ఉండాలనే వాదన రోజురోజుకి పెరుగుతుంది. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులూ ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు. ఇక మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గౌరవార్థం హుజూరాబాద్ కేంద్రంగా 'పీవీ జిల్లా' ఏర్పాటు చేయాలన్న దశాబ్దాల కల సాకారం కాబోతుందన్న నమ్మకం కూడా ప్రజల్లో బలపడుతోంది. ఇదే క్రమంలో ఆలస్యమైనా పీవీ జిల్లా ఏర్పాటవుతుందనే ఆశలు మరింత పెరుగుతున్నాయి. ఈ ఏడాది కాలం నిరీక్షణ తర్వాత పీవీ జిల్లా ప్రకటనపై పూర్తిస్థాయి స్పష్టత రానుంది.

# ఎమ్మెల్యే vs సీపీ

- **ఓ ఎస్సై అవినీతిపై ఫిర్యాదుల వెల్లువ**
- **సీపీ చర్యలకు సిద్ధం కాగా అడ్డుకున్న ఎమ్మెల్యే?**
- **రాజకీయ ఒత్తిళ్లకు తాళలేక లాంగ్ లీవ్ పై సీపీ**

అక్షరదర్బార్, కరీంనగర్ : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్, రాజకీయ వర్గాల మధ్య జగడం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తన విధులకు లాంగ్ లీవ్ ప్రకటించి వెళ్లడం చర్చనీయాంశమైంది. అందుకు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో తలెత్తిన వివాదమే ప్రధాన కారణమని తెలుస్తోంది. పోలీసుల అంతర్గత క్రమశిక్షణ, విధుల్లో రాజకీయ జోక్యంతోనే ఈ పరిణామం జరిందని స్థానికంగా చర్చ నడుస్తున్నది. ఈ వివాదానికి మూలం ఒక ఎస్సైపై వచ్చిన ఫిర్యాదులు. సదరు ఎస్సై ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సిఫార్సుతోనే ఆ స్థానంలో పోస్టింగ్ పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఎస్సై తీరు, అవినీతిపై అనేక ఫిర్యాదులు అందడంతో సీపీ గౌస్ ఆలం స్వయంగా విచారణకు ఆదేశించారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో, క్రమశిక్షణా చర్యల్లో భాగంగా అతడిని అటాచ్ చేసేందుకు సీపీ సిద్ధమయ్యారని సమాచారం. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి తన మనిషిపై చర్యలు తీసుకోవద్దని కోరినట్లు తెలిసింది. సీపీ ఈ ఒత్తిడిని ఖాతరు చేయకపోవడంతో ఎమ్మెల్యే నేరుగా ఒక మంత్రి వద్దకు వెళ్లి అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తన విధులకు అడ్డంకులు ఎదురవుతున్నాయని, కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకునే స్వేచ్ఛ కూడా లేకపోవడంపై సీపీ గౌస్ ఆలం తీవ్ర మనస్తాపానికి గురయ్యారని తెలిసింది. రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో, సదరు ఎస్సైని అటాచ్‌మెంట్‌కు బదులుగా ఏకంగా సస్పెండ్ చేస్తూ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఆ వెంటనే తన నిరసనను వ్యక్తం చేస్తూ సెలవుపై వెళ్ళిపోయారని తెలిసింది. అటు సదరు ఎస్సై సైతం ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం వల్లే తనపై కఠిన చర్యలు పడ్డాయని, కేవలం అటాచ్‌మెంట్‌తో పోయే దానికి సస్పెన్షన్ కొనితెచ్చుకున్నట్లయిందని తన సన్నిహితుల వద్ద వాపోతున్నట్లు సమాచారం.




## ముందస్తు సంక్రాంతి సంబరాలు

అక్షరదర్బార్, హనుమకొండ: బన్ను న్యూరో హెల్త్, రిహాబిలిటేషన్ సెంటర్ లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ హాజరై వేడుకలను ప్రారంభించారు. సంక్రాంతి పండుగను ప్రతిబింబించేలా భోగి మంటలు, బొమ్మరిల్లు, భోగి పళ్ళు వంటి సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఈవీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ చిన్నారులతో కలిసి పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయ పండుగలను ఈ విధంగా పిల్లలతో కలిసి జరుపుకోవడం అభినందనీయమని, బన్ను న్యూరో హెల్త్, రిహాబిలిటేషన్ సెంటర్ సేవలు సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బన్ను న్యూరో హెల్త్, రిహాబిలిటేషన్ సెంటర్ ప్రిన్సిపాల్ వీరమల్ల కిరణ్ కుమారి, చంద్రజిత్ రెడ్డి, టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

# మేడారానికి ఈసారి 3కోట్ల మంది భక్తులు

- సమ్మక్క సారలమ్మ జాతరను కుంభమేళాకు మించి ఘనంగా నిర్వహించాలి
- రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ
- మంత్రులు లక్ష్మణ్ కుమార్, సీతక్క




అక్షరదర్బార్, హైదరాబాద్: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఈసారి దాదాపు మూడు కోట్లమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఈ నెల 28 నుంచి 31 వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో జరిగే మహా జాతరపై మంగళవారం డా బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సవ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు హాజరయ్యారు.

మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ మాట్లాడుతూ గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి 2026లో జాతరకు దాదాపు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని అధికారులకు పిలుపునిచ్చారు.

మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ఈసారి జాతర ఏర్పాట్లకు రూ.150 కోట్లతో పాటు గద్దెల పునరుద్ధరణ పనులకు రూ.101 కోట్లు మొత్తం రూ.251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేశారని వివరించారు. జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మేడారం జాతరకు సీఎం రేవంత్ రెడ్డి 2010 నుంచి ప్రతీ జాతరకు వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొదటిసారి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు మాట్లాడుతూ మేడారానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్లను ఉపయోగించుకోవాలన్నారు. మేడారం జాతరలో పనుల పురోగతిపై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్ష్మణ్ కుమార్, సీఎస్ రామకృష్ణ రావు ఆవిష్కరించారు.

## వెంకటాపురంలో రోడ్డు భద్రతపై అవగాహన

అక్షర దర్బార్, నూగూరు/వెంకటాపురం : రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అరైవ్–అలైవ్ 2026' కార్యక్రమాన్ని మంగళవారం వెంకటాపురం పోలీసులు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ ముత్యం రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగి ప్రతి వ్యక్తి సజీవంగా గమ్యానికి చేరుకోవాలన్నదే కార్యక్రమ లక్ష్యమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. సిగ్నల్ జంపింగ్, అధిక వేగం, తప్పుదారి ప్రయాణం నివారించాలని, పాదచారులు జీబ్రా క్రాసింగ్ వినియోగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని, ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్‌లో వైద్య సహాయం ప్రాణాలు కాపాడుతుందని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ 'అరైవ్–అలైవ్ 2026'ను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ తాటి సరస్వతి, ఉపసర్పంచ్ షేక్ సన్నీ, నూగూరు సర్పంచ్ ఇండ్ల శ్రీను, ఎస్ఐ కొప్పుల తిరుపతిరావు, ఆటో డ్రైవర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.






## మకర జ్యోతి దర్శనానికి ఏర్పాట్లు

అక్షరదర్బార్, పరకాల: శబరిమల మకర జ్యోతి దర్శనం సందర్భంగా బుధవారం పరకాల పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో జ్యోతి దర్శనం, పడిపూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. జ్యోతి దర్శనం అనంతరం పడిపూజ కార్యక్రమం ఘనంగా జరుగుతుందని తెలిపారు.

## పిడిసిల్లలో మండల స్థాయి కబడ్డీ పోటీలు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామంలో మాజీ సర్పంచి కీర్తి శేషులు నైనకంటి రంగారెడ్డి జ్ఞాపకార్థం మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను ఈ నెల 16, 17 తేదీలలో (శుక్రవారం, శనివారం) పిడిసిల్ల ప్రభుత్వ పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వివరాల కోసం 990843 7614 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నైనకంటి ప్రభాకర్ రెడ్డి కోరారు.

## ఇసుక అక్రమ రవాణాపై నజర్

- నిబంధనలను అతిక్రమిస్తే చర్యలే..
- 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారా మాత్రమే ఇసుక పంపిణీ
- కలెక్టర్ రాహుల్ శర్మ



అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సంకీర్త్‌తో కలిసి రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, రవాణా, టీజీఎండీసీ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గతంలో అమలు చేసిన మాన్యువల్ కూపన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఇకపై ఇసుక అవసరమైన లబ్ధిదారులు తప్పనిసరిగా 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా ఇసుక పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలు స్వాధీనం చేసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాగులు, ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, ఆర్డీఓ హరికృష్ణ, రవాణా అధికారి సంధాని, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం



అక్షర దర్బార్ ,మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల కేంద్రం నుండి అంకుషాపురు గ్రామం రోడ్డులో మంగళవారం ఉపాధి హామీ పనులను స్థానిక సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన పనుల ద్వారా కూలీలకు ఉపాధి లభించడమే కాకుండా భూగర్భ జలాలు నిల్వ ఉండటానికి దోహద పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, పాలక వర్గ సభ్యులు టెక్నికల్ అసిస్టెంట్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రైతు రక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

అక్షరదర్బార్, పరకాల: తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా, హనుమకొండ జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రైతు రక్షణ సమితి నిరంతరం పోరాటం చేస్తోందని అన్నారు. రైతుల హక్కుల సాధన కోసం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, సలహాదారు సుధాకర్, ఉపాధ్యక్షుడు చవుల్ల రామారావు, కార్యదర్శి సురావు బాబురావు, జిల్లా నాయకులు అంబిరి శ్రీనివాస్, ఎల్కతుర్తి, పరకాల మండల అధ్యక్షులు వాంకే రాజు, కొక్కు తిరుపతి, లక్కర్స్ మధుకర్, కమలాపూర్ ప్రధాన కార్యదర్శి తిప్పారపు సుధాకర్, ఎల్తుర్తి



ప్రధాన కార్యదర్శి కొదటీ మాధవరావు, రైతు నాయకుడు లోనే సతీష్ పాల్గొన్నారు.



# కైట్స్ ఫెస్టివల్ లో మాజీ ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, భూపాలపల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భూపాలపల్లి సుభాష్ కాలనీలోని మున్సిపల్ గ్రౌండ్లో నిర్వహించిన కైట్స్ ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలతో కలిసి గాలిపటాలు ఎగురవేశారు. అనంతరం జంగేడు–భూపాలపల్లి గెట్ టు గెదర్ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన టీషర్ట్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ, పండుగల ద్వారా కుటుంబ అనుబంధాలు బలపడతాయని, గ్రామీణ సంస్కృతి–సంప్రదాయాల పరిరక్షణలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పిల్లలు ఆనందంగా గడపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, పిల్లలతో గడిపిన క్షణాలు తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేశాయని తెలిపారు.



# దక్షిణ భారత సైన్స్ ఫెయిర్ కు గిరిజన విద్యార్థి ఎంపిక

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యా నికేతన్ విద్యాసంస్థల్లో జనవరి 7, 8, 9 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ములుగు జిల్లా రాయినిగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి పి. తరుణ్ (9వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. 'హెల్త్ అండ్ హైజిన్' అంశంలో ట్రెడిషనల్ హెర్బల్ మెడిసిన్ ప్రాజెక్టుతో పాల్గొన్న తరుణ్, ఏటు నాగారం ఐటీడీఏ పరిధిలో తొలిసారిగా దక్షిణ భారత రాష్ట్రాల సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు జనవరి 18, 2026 నుంచి జాతీయ స్థాయిలో జరగనున్నాయి.ఈ ప్రాజెక్టుకు బయాలజీ ఉపాధ్యాయుడు ముఖ్య ప్రతాప్ సింగ్ గైడ్ టీచర్‌గా వ్యవహరించి విద్యార్థికి సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, గైడ్ టీచర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

**- సీఐ డి నరేష్ కుమార్**

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి పట్టణంలో నిషేధించబడిన చైనా మాంజా విక్రయాలు, నిల్వలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి సీఐ డి నరేష్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలో సీఐ డి నరేష్ కుమార్, ఎఫ్ఆర్వో నరేశ్, ఎస్సై సతీష్ లతో కలిసి పలు





దుకాణాలు, వ్యాపార కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నిషేధిత చైనా మాంజా విక్రయాలు జరుగుతున్నాయా..? నిల్వలు ఉంచుతున్నారా..? అనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ చైనా మాంజా వాడకం వల్ల పక్షులు, జంతువులు, మనుషులకు తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రధానంగా విద్యుత్ తీగలు, మెడలు కోసుకునే ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రజల ప్రాణ రక్షణ దృష్ట్యా ప్రభుత్వం చైనా మాంజాను పూర్తిగా నిషేధించిందని, ఎవరైనా వ్యక్తులు లేదా షాపులు నిషేధిత చైనా మాంజాను విక్రయించినా, నిల్వ ఉంచినా, వినియోగించినా, వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. భూపాలపల్లి పట్టణ ప్రజలు, వ్యాపారులు ఈ విషయంలో పూర్తిగా సహకరించాలని, నిషేధిత చైనా మాంజాను విక్రయించకుండా, వాడకుండా ఉండాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలి
- బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : రాబోయే ములుగు మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని జిల్లా పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అన్నారు. ములుగు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు చెన్న విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ములుగు మున్సిపాలిటీని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ములుగు జిల్లా, వైద్య కళాశాల, ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. మున్సిపాలిటీ




ఎన్నికలు పట్టణ భవిష్యత్తుకు కీలకమని, కార్యకర్తల అంకితభావంతోనే విజయం సాధ్యమని అన్నారు. ప్రతి వార్డులో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు.




# అనాథ కుటుంబానికి అండగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : నూగూరు వెంకటాపురం మండలంలోని ముకునూరి పాలెం గ్రామానికి చెందిన సోయం కామయ్య, సోయం సమ్మక్క దంపతులు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబం అనాథగా మారింది. మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచెర్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బట్ట నాగేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3,000 నగదు, 25 కేజీల బియ్యం బ్యాగ్‌ను అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు సోలెం సుధాకర్, పోడెం సురేష్‌తో పాటు పలువురు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దాతలను అభినందించారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీకి చర్యలు

**జిల్లా వ్యవసాయ అధికారి జే. బాపు రావు**

అక్షర దర్బార్, మల్హర్ : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ జరుగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి జే. బాపు రావు తెలిపారు. మంగళవారం మండలంలోని కొయ్యూరు, వల్లెంకుంట గ్రామాలలోని మన గ్రోమోర్ సెంటర్, హాక ఫార్మర్ సర్వీస్ సెంటర్, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విక్రయ కేంద్రాల్లో యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వ్యవసాయ ప్రాథమిక కేంద్రాలు, హాక, ఆగ్రోస్ కేంద్రాలలో సరిపడ యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. అదేవిధంగా ఈపాస్ యంత్రం ద్వారా రైతు ఆధార్ నంబర్ నమోదు చేసి మాత్రమే యూరియా విక్రయించాలని



దుకాణ నిర్వాహకులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పిడిసిల్ల మాజీ సర్పంచ్ మృతి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచి దండ ప్రభు రెడ్డి ( 95) అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందారు. 1962లో ఏకధాటిగా 10 ఏండ్లు సర్పంచిగా గ్రామానికి సేవలు అందించిన దండ ప్రభు రెడ్డి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. మృతుడి కుమారుడు దండ వెంకటేశ్వర రెడ్డి మాజీ ఎంపీటీసీగా పని చేశారు. ప్రభురెడ్డి మృతి చెందిన సమాచారం తెలిసి పలువురు ప్రముఖులు దండ వెంకటేశ్వర రెడ్డిని పరామర్శించారు మొట్లపల్లి ఆలయ కమిటీ చైర్మన్ గూడూరు రఘుపతి రెడ్డి మాజీ చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు



# మొగుళ్ళపల్లిలో రోడ్డు భద్రత వారోత్సవాలు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సదస్సుకు మొగుళ్లపల్లి ఎస్సై బోరగాల అశోక్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్తులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో




సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ పంచాయతీ కార్యదర్శి నరేష్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు కేతరాజు రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సరికొత్త మేడారం



## ఆకట్టుకుంటున్న జంక్షన్లు

అక్షరదర్బార్, మేడారం : సమ్మక్క సారలమ్మ జాతర జరిగే ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం ఈసారి అనేక ప్రత్యేకతలను సంతరించుకుంటుంది. వివిధ అభివృద్ధి పనులతో మేడారం టెంపుల్ సిటీగా మారిపోతుంది. మేడారంలో సమ్మక్క సారలమ్మ గద్దెలు, ప్రాంగణం పునరుద్ధరణకు రూ.101 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ కోసం అభివృద్ధి పనులకు మరో రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో శాశ్వత ప్రాతిపదికన వివిధ అభివృద్ధి పనులు పూర్తికావస్తున్నాయి. అమ్మవార్ల గద్దెలు, ప్రాంగణంతో పాటు ప్రభుత్వం మేడారంలో రహదారులను విస్తరించింది. ఇందులో భాగంగా ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా రూపుదిద్దుకున్న జంక్షన్లు మేడారాన్ని సందర్శిస్తున్న ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 28 నుంచి 31 వరకు మేడారంలో సమ్మక్క సారల మహా జాతర జరగనుంది.














# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915